చిన్న చూపు

శ్రీమతి జానకీ పురుషోత్తం గారు

౧

"అమ్మా, ఓమారిట్లా వస్తావు" అన్నాడు గంగాధరరావు ఈజీచైరులో కూర్చుని ఉత్తరాలు చూసుకుంటూ.

"ఎందుకురా, నాయనా! పిల్చావు? టపా వచ్చిందా ఏమిటి?"

"అవునమ్మా! బావ ఉత్తరం వ్రాశాడు. శ్యామల, పిల్లవాడు వస్తారట రేపు పదయింటి రైలులో. స్టేషనుదాకా వెళ్ళవలసి ఉంటుంది."

"అయితే ఆయనకూడా రావటంలేదూ? పిల్లనొక్కర్తెను ఎట్లా పంపుతాడు?"

"లేదు. అతను రాడట. పను లేవో ఉన్నాయట. ఎరుగున్న వాళ్ళెవరో వస్తూంటే శ్యామలను పంపుతున్నాట్ట."

"సరే, అదైనా వస్తోంది. పిల్లవాడు ఎల్లాగవున్నాడో యేమో? ఆమధ్య కాకి తాకిందన్నారు."

"అంతా కులాసా అనేవున్నది ఉత్తరంలో. వస్తున్నారుగా రేపు ప్రొద్దున."

"పదిరోజులపాటైనా వుంటామని వున్నదా ఉత్తరంలో."

"ఆఁ ఉంటుందిట. అక్కడ అతని మేనత్త గడుపుతుందిట."

"నాకు సావకాశం లేదు అయిదు నిమిషాలు నిలుచోడానికైనా. పొయిమీద వస్తువు మాడిపోతుంది. అయితే అబ్బాయి! రేపు వెడతావుగా రైలుదగ్గరకి."

"వెడతానమ్మా! అంతా తొందరే. కావలసినంత టైముంది. ఇప్పటినుంచీ ఎందుకు ఆలోచన."

"అందుకు కాదురా, అబ్బాయి! నా ఆదుర్దా నాది, ఎన్నాళ్ళో అయింది దాన్ని చూచి."

"అవును, కాదూ మరి, క్రిందటి సంక్రాంతి కారు చూచింది...సరే వెళ్ళి పని చూసుకో."

౨

తొమ్మిదిన్నరైంది గడియారంలో. తలవాకిట తలుపు తెరచిపెట్టి లక్ష్మమ్మ మాటిమాటికి వచ్చి తొంగి చూసిపోతోంది. త్రోవనుపోయే ప్రతిబండీ తమయింటికేనని. అందులో శ్యామల పిల్లవాడు కూడా వున్నారని ఆమె భ్రమ.........

పదిగంటలకి శ్యామల వచ్చింది. పిల్లవాడు కూడా వున్నాడు వెంట. లక్ష్మమ్మగారు మడికట్టుకున్నానన్న మాట మరచిపోయి ఉత్సాహంతో మనుమడిని అమాంతం ఎత్తుకుని ఒక పాతిక ముద్దులు గుమ్మరించింది. తరువాత కూతుర్నికూడా స్పృశించి "యిట్లా అయిపోయినావే? ఇదివరకున్న ఎంత నల్లబడ్డావు. అదిగో కళ్ళలో బొత్తిగా నెత్తురుచుక్కన్న మాటే లేదు." అని యిత్యాది వాక్యాలతో ఆహ్వానిస్తుండగా గంగాధరరావు

వచ్చి "అమ్మా! మరీచాదస్తానపడి పోతున్నావేం? వచ్చింది. పదిరోజులుంటుందిగా. అంతశాస్త్రయం ఒక్క- సారేనా? మైలపడితివి. వంటపే మైపోయిందో వెళ్లు చప్పున." అన్నాడు.

"ఏమోరా నాయనా! మతిఉండడంలేదుబొత్తిగా. పోతున్నా. ఆగుడ్డలువిడిచి నీళ్లుపోసుకో అమ్మాయి! అయితే పిల్లవాడికి తలంటిపోస్తావా?"

"ఈవేళ కాదు, రేపుపోస్తాను. నీవువెళ్లి వంటపనిచూడు......అయితే ఒదినెక్కడ?..."

లక్ష్మమ్మగారు రెండుచేతులు నెత్తిన కొట్టుకుని ప్రక్కనున్న గదివైపు పళ్లుబిగించి చూపిస్తూ, బిగ్గరగా వినపడకుండా ఏమిటో గొణిగింది.

"సరే. మామూలేగా. క్రొత్తేముంది. వెళ్లు"......అని శ్యామల గదిద్వారందాటి లోపలకి వెళ్లింది. మంచంమీద అడ్డంగా ముసుకుపెట్టుకుని పడుకుంది సావిత్రి. అందుచేత శ్యామల దగ్గరగావెళ్లి "వదినా! వదినా" అన్నది.........

"నువ్వా? అప్పుడేకలువచ్చిందీ? ఏమిటో ఒళ్లే తెలియడంలేదు..."

"వొంట్లోఏమిటి? వదినా! ఎన్నాళ్లనుంచీ? అన్నయ్య, అమ్మ ఎవరూ చెప్పేరేకారేం?."

"ఆఁ...వాళ్లకేంపట్టింది నాసంగతి? నన్నొకమనిషిగా యెంచుతున్నారా వాళ్లు? లేకపోతే నేనూ లోకంలో పాటేవుందును."

"వొంట్లోఏమిటి, జబ్బు"?

"ఏమనిచెప్పను? ఒకటైతే అనుకోవచ్చు. ఏమిటో ఒళ్లంతానొప్పులు, కాళ్లుమంట, చేతులునొప్పి, ఒకక్షణంలేస్తే కళ్లుతిరుగుతై. రవ్వంతపని ఏమన్నాచేస్తే ఎంతో ఆయాసవచ్చి ఉక్కిరిబిక్కిరి అవుతాను... మరి తిన్నదంతా ఏమైపోతోందో?"

"మరి మందూ అదీ ఏమీ పుచ్చుకోడంలేదూ?"

"ఎందుకడుగుతావు, అటువంటివి. ఎవరికైనా నాసంగతి కావలస్తేగా? పోనీ నాలికకు హితవుగా ఉండేపదార్థాలు తిందామనుకున్నాగాని వీల్లేదాయె. ఏమడుగుతావు నాపని. ఉంటే వున్నవాళ్లల్లోనూ జతగాను, పోతే పోయినవాళ్లల్లోనూ జతగాను, ఇట్లావుంది."

"ఇస్సొ....ఏంకష్టాలమ్మా......పిల్లాడెక్కడ?"

"నాకుతోడు వాడొకడు. ఇంతపెద్దదాన్ని నాపనే యిల్లాగుంటే వాడ్నిగూర్చి వేరేచెప్పాలా? రోజు రోజూ ఎండుకొస్తున్నాడు. నాలుగోయేడన్నమాటేగాని ఏడాదిపిల్లవాడల్లే వున్నాడు. పాపకేది? పైగా అంతాకొట్టడము, తిట్టడమూను. మనపిల్లాడు—అనేలక్ష్యం అభిమానమూ వుంటేగా?......ఇందాకవరకూ నీకోసం కలవరించేడు. ఇప్పుడే ప్రక్కింటివారింటికి కాబోలు వెళ్లేడు...నీపిల్లాడు ఎల్లావున్నాడు?"

"ఆఁ...సరిగానేవున్నాడు...బాగానేవుంది..."

"సరే. స్నానంకానీ, ఆలస్యమెందుకు?"

"నువ్వు లేవక"—అంటూ సావిత్రితత్వం, తరహా అంతా పూర్వంనుంచీ యెరుగున్న శ్యామల లోలోపల నవ్వుకుంటూ గదిలోంచి వెళ్లింది.

3

మధ్యాహ్నం సావిట్లోకూర్చుని పత్తివొత్తులు చేస్తోంది లక్ష్మమ్మగారు. దూరంగా మంచంమీద శ్యామల మేలుకొనే పడుకుంది. పిల్లవాళ్లిద్దరూ కేకలువేస్తూ ఆడుకుంటున్నారు.

ఉన్నట్టుండి లక్ష్మమ్మగారు "సావిత్రీ!—ఓ సావిత్రీ!—ఓ సావిత్రమ్మా!...అక్కే, అంతమాత్రంలో వినబడితే యెట్లా?......ఓసావిత్రీ! లేచికాఫీకి నీళ్లు పెట్టదూకాస్త, పిల్లవాడు యేడుస్తాడో, యేమో"—అన్నది.

పైపిలుపుల్లో ఒకదానికీ ప్రత్యుత్తరం రాలేదు. అయిదునిముషాలైన తర్వాత లక్ష్మమ్మ గది తలుపు త్రోసి—

"అమ్మాయి, సావిత్రీ! ఏమినిద్దరే? ఇరవై నాలుగుగంటలూ నిద్దరే, దరిద్రం, అట్లా వచ్చి అడబిడ్డతో మాట్లాడరాదా? కాఫీకి నీళ్లు పెట్టమంటే వినిపించుకోరాదా? నేను మడిలో చస్తిని—కాస్త మాట వినకపోతే యెట్లా యేడవనే? అమ్మాయీ!" అని దీర్ఘంతీసింది.

"ఏం, మావాళ్లు నాకేం కాఫీలు అవి చెయ్యడం నేర్ప లేదు. అవన్నీ తెలిసిన కోడళ్ని చేసుకోక పోయినారూ? పెట్టూ, పెట్టూ అంటే ఎట్లా పెడుతాను. నాచేతకాదు. అసేగాక అస్తమానం పనిచెయ్యాలి నుండె, ఒక్కక్షణం తలనొప్పిగావుండి పడుకుంటే ఉమారుమనడమాయె, చావమన్నారాయేం? నాకింత కన్న చేతకాదు. మీరు నాకు చేసేదానికి నేచేసేది చాల్లెండి. అంత చాలకపోతే మరొక కోడల్ని-చేయ కలిగినదాన్ని—తెచ్చుకోవచ్చు."

"ఎందుకే, అట్లా ప్రతిమాటు అర్థంలేకుండా మాట్లాడుతావు? శాణాతనం నేర్చావు, మహా. ఎక్కడికిపోతై బుద్ధులు. ఆ తల్లికూతురివి కావు. రాజ్యాలు ఏలగలరే అమ్మా! వచ్చినప్పటినుంచీ చూస్తాను. ఎప్పుడూ ఒకేరీతిగా ఉంది నీ ప్రవర్తన; ఈ నాలుగేళ్లనుంచి నేపడే అవస్థ పరమాత్ముడికి తెలుసు; ఏమో చిన్నపిల్లవు; ఈ రోజు కాకపోతే రేపో మాపో నేర్చుకుంటావు; నీవే సరిగా వుంటావని అనుకుంటున్నాగాని, యిట్లా పొగలబడి పోతావని, దుమ్మెత్తి పోస్తావని, కొయ్యలమారికొండవి అవుతావని, తప్పులమారితడి కవవుతావని కల్లోనైనా అనుకోలేదే, అమ్మా!......ఏమియిదిగావుందే నీపని. పోనీ నేనంటే సరే, వాడంటేనూ లేదాయెలక్ష్యం. పురుగుల్ని విసిరికొట్టినట్టుగా పడిపేస్తావు యిద్దర్నీగూడాను. ఏదోపోనీ పిల్ల యింటికి వచ్చిందికదా రెండురోజులైనా సంతోషంగా వుందామంటే నీకైజంమాన్తావా......"

"చాలు, చాలు. అపాశాన నోరుముయ్యండి. నేర్చుకపోయినారు. ప్రతిదానికి యిల్లుఎగిరిపోయేటట్లు కేకలేస్తారు. నాతో అట్టేమాట్లాడబోకండి. నోళ్లుమండుతుంది..."

"ఆం. ఆం. చూశావా, శ్యామలా! మీవొదినె యెంతద్దైందో. నేను నోరు మూసుకోవాలిట. ఎంతమాట, ఎంతమాట. అత్తంటే లక్ష్యమున్నదానివేనానువ్వు? నీతల్లియిల్లాగే పెంచిందా?......ఏముంది అన్నిటికి తెగించినదానికి... వాడురానీ చెప్తా యిదంతా. ఏమిటో లేలాలి......" అంటూ లక్ష్మమ్మగారు కళ్లనీళ్లపర్యంతం తెచ్చుకొని వంటింట్లోకి వెళ్లింది.

౪

"అబ్బాయి, గంగాధరం! ఇక ఒక్కక్షణం దీనితో వేగడందుర్లభం. కానివూళ్లో కట్టెలమ్ముకు బ్రతకవచ్చు. ఇట్లావుండలేంబాబు. బ్రతికుండగానే కొక్కతిటోంది. అడ్డమైన మాటలు, యిష్టంవచ్చినట్టు కూస్తోంది. అమ్మలక్కలందరూ నన్ను దుయ్యబట్టుకుంటున్నారు......ఒక్కవిషయంలో గోరంత సహాయ్యం లేక పోగా అడుగడుక్కీ తప్పడం, సాధించడం, దుమ్మెత్తి పొయ్యడం. పోనీ నీవన్నా

అంతమాత్రంగా నేవుంది లక్ష్యం. మొన్న పహో చూడలేదూ? కోటుకుట్టవేఅంటే ఎల్లాగు మొహాన పారేసిందో. గుండెలు అర్చుకు పోతున్నైరా అబ్బాయి! ఇష్షో."

" ఎందుకమ్మా! పదిసార్లు అనుకోవడంకూడాను. ఏమన్నాలాభముంది గనుకనా? అట్లావిరగబడి పోతోంది. మరి ఏంచూసుకున్న గర్వమో? పుట్టింటికితోలేస్తే తెలుస్తుంది, గుప్పెడు మెతుకులకికూడా గతి లేదు."

" ఇప్పుడదేగా దాని పట్టుదల. అక్కడేమున్నదనే ఆలోచన దానికేది? పుట్టింటికి పంపించండి, అక్కడ ఉంటాను. వాళ్లు, వీళ్లు, ఎంతకాలంపుట్టిళ్లల్లో వుండడంలేదు.—అని దానిపంతం".

" ఏమో, నాకేమీ తోచకుండా వుంది, పుట్టింట్లో ఎన్నాళ్లని వుండనీయగలం? లోకానికేనా వెరవద్దూ?......... అబ్బబ్బ, ప్రాణసంకటంగా వుందమ్మా! పెళ్లాంకాదు. పెటాకులు. ఉండేం, ఊడేం ...ఏమోలే. ఇంతకు కర్మం—వడ్డించు కచ్చేరికి వేళైంది, పోవాలి..."

" అట్లాగే, నాయనా! స్నానంకానీ......సావిత్రీ! ఎక్కడే? సావిత్రీ!...వీలుగావుంటే పీట, విస్తరివేస్తావూవచ్చి......"

"వీలుగాకేం? నాకెప్పుడూవీలే. మరొకరికంటె వీలుండదుగానీ. ....."

కొంతకాలము గడచిపోయినది.

"ఏమేవ్ సావిత్రీ! పదినిముసాలైంది. రావేమీ వాడి కచ్చేరికి వేళ అయింది..."

"ఛీ, పాడుబ్రతుకు, తలనొప్పితో చస్తూంటే పలుకరించే దిక్కేవాలేదు. పైగా అది చెయ్యలేదు, ఇదిచేయ్యలేదు... వెళ్లి చేసే మహోద్యోగంమండిపోతోంది......వేళైంది, వేళైంది..."

"ఇంత పనికిరాదే, అమ్మా! మహోద్యోగమా? అదీ లేకపోతే? ఏం, ప్లీడరుగుమాస్తాపని మాత్రం ఊర్కేవుందా? తెలివి తేటలుంటే అందులోనే సంపాదించవచ్చు......

"అవునవును. కనపడుతోందిగా సంపాదన...ఏమని చెప్పించేసు చదువు...కుంటికోనమ్మల్లే...ఏం ఉద్యోగం? పరువు, ప్రతిష్ట అక్కర్లేదు......గుమాస్తా...ఛీ."

"అవును, మరి మీ వాళ్లంతా తహశ్శీలుదారీ కలెక్టరీ, చేశారుగారూ...

"అవేమీ చెయ్యకపోయినా, కాలుమీద కాలేసుకుని కూర్చున్నారు. పొలాన్నుంచి ధాన్యంవచ్చి వాకిట్లో వాల్తుంది. అదేనా కనబడదాయె యిక్కడ. మోచెయ్యి ఆడితేగాని ముంజెయ్యి ఆడదాయె... ఇంతకూ నాకర్మం, ఈ మహాసంస్థానంలో ఎట్లాగైనా పడక పోతానని ఎంతో ఆదుర్దాపడ్డాడు మా మామయ్య. అప్పుడు ఆలోచన లేదు...కంతానికి ఊరిపోశారు, అన్నివిధాల. తోటివాళ్లంతా సుఖంగావుంటే నాగతియిది."

"అవునమ్మా! కాదుమరి? జమీందారుల పిల్లవాయె. ఇక్కడ వుండలేక ఉడికిపోతున్నావు. చేసేటప్పుడే మీవాళ్లు ఆలోచించుకుంటే పోయేది. మాకర్మం ఏలాగుంటే అట్లాఅయేది......"

"అవునవును, కాదుమరి? నామూలాన్నైనా బ్రహ్మచర్యం వొదిలింది అబ్బాయిగారికి."

"నిజమేలే, తల్లీ! నిన్ను పలుకరించడం బుద్ధిపొరపాటువాది..."

౫

గదివైపు వసారాలోకూర్చుని సాయంకాలం సావిత్రి జడ వేసుకుంటోంది. శ్యామలకొడుకు గభాలున పరుగెత్తుకొంటూవచ్చి నూనెసీసా తన్నేశాడు. ధళ్లున సీసాబద్దలై ఆమెచీరంతా నూనెఅయింది. సావిత్రి మండిపడ్డది—"దౌర్భాగ్యపు పిల్లాడా! కళ్లుకనబడ్డంలేదూ? మిడిసిపోతున్నావు. ఏమిటిదంతా నీకొంప—" అంటూ పిల్లవాణ్ణి ఆయిదారు అంటించింది. ఈగల్లంతుకు శ్యామల, లక్ష్మమ్మగారు పరుగెత్తుకు వచ్చేరు. శ్యామల కంటతడిపెట్టి పూరుక్కుంది. లక్ష్మమ్మగారు గబగబ పిల్లవాణ్ణి ఎత్తుకుని—"ఓ అమ్మ! లేదే, మావాయన! లేదే, కన్నారి! లేదే," అంటూ సావిత్రిదగ్గరగా వెళ్లి—"ఏమే? బుద్ధిమాలినదానా! నీపుసిగాద లేలేటట్లు అట్లాకొట్టావు? నీపిల్లవాడయితే నాకు కాడు నీకుమాత్రం? ఏదో నాజుగుదోజాలు పుందామనివస్తే యీలాగు చేస్తావా? అంతయిష్టంలేకపోతే యిష్టంలేనట్లుండరాదూ? ఏదోచూడక నీసా తన్నినంతమాత్రాన అట్లా కొడతావా పసివాణ్ణి? పోనీ కంతంపిసికి పారెయ్యకపోయినావు. పీకవొదిలేసి......మాట్లాడవేం? ...... ఏమీ తెలియనిదానిలాగు."

"ఆపిల్లవాడు చేసిందెవ్వరికీ కనబడదు. నూనంతా కాస్తలేకుండాపోయింది. చీరపాడైంది... నేను కొట్టిందిమాత్రం కన్పిస్తుంది. కొడితే కొట్టాలెండి. ఆమాత్రం అదుపు పెట్టే అధికారం నాదగ్గరావుంది... లేక పోతే మొదటే పిల్లవాణ్ణి యిక్కడకు రాకుండా జాగ్రత్తపెట్టలేక పోయినారూ."

శ్యామలకు ఏడుపువచ్చింది.—"ఇక్కడకురావడం నాదేపొరబాటు. నీకింతకష్టమెందుకు? నేనే వెళ్తాలే, ఒదినా." అన్నది.

"నేనూ చూస్తున్నాగా... అదివచ్చినదగ్గరనుంచీ మరీ మొదలు. మొన్న పహాను వ్వేదోతింటూ పిల్లాడికేనా రవ్వంత పెట్టలేదు. అదిమాత్రం గ్రహించదా? తెలియదా? వెకుతుందిలే, రాజ్యం అనుభవిద్దువుగాని... రావే శ్యామలా!"...అంటూ లక్ష్మమ్మగారు నిష్క్రమించింది.

సావిత్రికి దోమవాలినట్టైనా లేదు. జడపూర్తిచేసి, ముఖంతోముకుని గదిలో పడకవేసింది. పావు గంట తరువాత శ్యామలవచ్చి—"ఒదినా! అనసూయలో వాళ్ళింటికి పేరంటానికి వస్తావా వెళదాం? పిల్చి వెళ్లేరుగా, యిందాక."

"ఎందుకు పేరంటానికికూడా, సిగ్గులేక. నాజవాయిరి, నాపట్టుచీరెలు వాళ్లుచూచి ఆనందించే టందుకా?"

"అదేమిటమ్మా! నగలతోను, బట్టలతోను వస్తుందా గౌరవం, మర్యాద? పనివల్ల పలుకునల్ల గాని."

"అందుకే కాబోలు అవన్నీదిగేసుకుని బయల్దేరావు. ప్రక్కన నేను దృష్టిపరిహారార్థంలో సమారావడం?"

"ఎందుకమ్మా! అట్లామాట్లాడుతావు. నాకు అంతదూరం ఆలోచనలేదు. ఇద్దరంకలిసి వెళదాంగదా అనిపిల్చాను. పోనీ యీగొలుసును వ్వేసుకో, యిందు..."

"అక్కర్లే, ఛీ, సిగ్గులేక ఎరువుసొమ్ముగూడాను. ఉంటే పెట్టుకోవాలి, లేకపోతేలేదు. నాకర్మం ఎవరేంజేస్తారు. ఈమహాసంస్థానంలో యిట్లా అనుభవించాలిసివుంకే..."

"పోనీ, ఒదినా! నేను యివన్నీతీసి వేసివస్తాను. బయలుదేరుతావా?"

నాకోసంతియ్య నక్కర్లేదు. నీవు వెళ్లు. నేరాను. అయిదోతనంవుండిగూడా అత్తతో సమానంగా..."
శ్యామలవినలేక, వెంగున వెనక్కు తిరిగి వెళ్లిపోయింది.

౬

"ఏమే, దౌర్భాగ్యపుదానా! నీమూలాన నాకంఠం పిసుక్కోవలసివచ్చేటట్టుందేం? నాకుదాపరించావు." అన్నాడు గంగాధరం గదిలో అడుగుపెట్టి.

ముసుగుపెట్టుకుని పడుకున్న సావిత్రి చెంగునలేచి పళ్లుబిగిస్తూ—"ఇదిగో జాగ్రత్తగా మాట్లాడండి... దౌర్భాగ్యం నాకా, మీకా? మీరేమని చేసుకున్నారు దౌర్భాగ్యపుదాన్ని? గతిలేకా? ఇస్తేనేకాని వల్లకాదని మామామయ్యచుట్టూ తిరిగి వేధించి కట్టుకున్నారు. మీరే నాకుదాపరించారుపైగా, లేకపోతే శుభ్రంగా..."

"ఒళ్లు తెలిసి మాట్లాడుతున్నావా? తెలియకుండా మాట్లాడుతున్నావా?"

"బాగా తెలిసే, కావాలని మాట్లాడుతున్నాను. లేకపోతే ఏమిటి యిదంతా? నాకర్మం..."

"నీమూలాన కోపంవచ్చి శ్యామల వెళ్లిపోతోంది. చూశావా, ఏంబాగుంటుంది?"

"నామూలాన వెళ్లడమెందుకు పైగా నన్ను ఏడిపించడానికివచ్చి? నిన్న నేగా తనకున్నవగలన్నీ పెట్టుకుని నన్ను హేళనచేసింది......పోనీండి వెడితేనాకేం? నన్ను ఉద్ధరిస్తుందా.?"

"అర్థంకావడంలేదు. ఏమిటి? ఎప్పుడు యింతేనువ్వు, నీమాటలు...బుద్ధివుండక్కర్లేదూ?"

"అవును నామాటలెట్లా అర్థమవుతాయి. చదివింది మెట్రిక్లేషన్‌దాకానేగా. చదువైనా అంటలేదాయె కర్మం"...

"నాచదువుసంగతి నీకెందుకు? మీనాయన మహా విద్యేప్యాసైనాడా?"

"ప్యాసుకాకపోతేయేం? డబ్బుంది. మనకదీలేదుగా? ఇట్లాగని తెలిస్తే ముందేబాగుండేది నాపని. విద్యావిహీనః—"అన్నారు.

"ఆఁ. ఆఁ. నన్ను పశువు అంటావు? ఫుంధాకోర్. మరీ తెగించిపోతున్నావు. బుద్ధిచెప్తాను..."

"మనకుఁటేగా మరొకరికి చెప్పడానికి..."

ఈమాట గంగాధరరావుకి నసాళమంటింది. ఇటువంటివి మామూలే అయినా ఈదినం అతనికష్టం, దుఃఖం మితిలేనివై పోయినాయి. కళ్లల్లోకి నీరుతెచ్చుకున్నాడు.

"ఎందుకుపైగా ఆదొంగఏడుపులు? నవ్విపోతారు ఎవరైనా. నన్నిట్లానక్టేట ముంచినవారికి నా ఉసురు కొట్టకపోతుందా?"

"నోరుముయ్."

"మీరేమూసుకోండి. మీరేమీ నన్నుసవలసినపనిలేదు. నేనేంపడేదాన్ని కాదు. ఇక ఒక్కక్షణం యిక్కడవుండదలచుకోలేదు. మాయింటికి వెళ్లిపోతాను."

"ఇకెప్పుడూరావా!"

"చదువుకుని బాగా డబ్బుసంపాదించిన తర్వాత కబురుపంపండి. అప్పుడాలోచిస్తాను."

"ఆఁ. ఆఁ. ఫుంధాకోర్!—"

"అదిగో అట్లామాటలు అనవద్దనే చెప్పేది. జ్ఞాపకంలేదూ? చెబుతున్నాను, నన్ను మీరేమీ కల్లోనైనా తల్చుకో అక్కర్లేదు!"

"అంతే, అంతే.........అమ్మా! అమ్మా! కొంపలంటుకున్నా పోతోందమ్మా! చూడు. చూడు."